# సంకెళ్లు

రాత్రి తొమ్మిదిన్నర దాటింది. హైదరాబాద్ బస్సు డిపో ట్యూబులైట్ల వెలుగులో కోలాహలంగా ఉంది. హైదరాబాద్ నుండి గుంటూరు వెళ్లే బస్సు డ్రైవరు చేతిగడియారం వంక మరోసారి చూసుకుని హారన్ నొక్కి వెనక్కి తిరిగి కండక్టర్‌ను అడిగాడు, "ఏమిటోయ్ ఆలస్యం? తొమ్మిదిన్నర దాటింది".

"ఒక పాసింజరు రావాలి గురో" అన్నాడు కండక్టర్.

"రిజర్వేషనా?"

"ఆ."

"తొమ్మిదిన్నర దాటింది. ఇంకెక్కడ వస్తాడు? నా మాట విని కేన్సలు చేసి ఉన్నవాళ్ళలో ఎవర్నో ఒకర్ని ఎక్కించు."

కండక్టర్ బస్సు దిగబోతుండగా పన్నెండేళ్ళ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి బస్సు ఎక్కబోతుంటే కండక్టర్ ఆకుర్రాడిని ఆపి, "రిజర్వేషనా?" అడిగాడు.

అలుపుమీద కుర్రాడు వెంటనే జవాబు చెప్పలేదు. టికెట్టు తీసి కండక్టర్ చేతికి అందించాడు. పరిశీలించి టికెట్టుమీద సంతకం పెట్టి చార్టులో టిక్ చేసుకుని "కూర్చో" అని తలుపువేసి, 'పోనీయి గురూ" అన్నాడు డ్రైవరుతో. బస్సు కదిలింది.

కుర్రాడు ఎయిర్‌బేగ్ సీటుకింద పెట్టి సీట్లో కూర్చున్నాడు. బస్సు రోడ్డుమీద కొచ్చి వేగం అందుకుంది. తన పక్కన కూర్చున్న కుర్రాడి వంక చూసి, "కొద్దిసేపు ఆలస్యం అయి ఉంటే బస్సు బయల్దేరి ఉండేది" అన్నాడు కాంతారావు.

"సిటీబస్సు దొరకలేదండీ."

"ఎక్కడి వరకు వెళ్లాలి?"

"గుంటూరు. మీరు?"

"నేనూ అక్కడికే."

"గుంటూరు ఎన్ని గంటలకు చేరుకుంటాం?"

"ఉదయం ఆరూ, ఆరున్నర అవుతుంది."

కిటికీలోంచి చల్లటి గాలి వీస్తుంటే కిటికీ మూశాడు కాంతారావు. హైదరాబాదు పొలిమేరలు చీకట్లో నుంచుండిపోయాయి. కుఱ్ఱాడు సీటుకు చేరగిలబడి కళ్లు మూసుకున్నాడు. అన్నయ్య, మాలతి వదిన, అమ్మ మనసులో పదే పదే మెదులుతున్నారు. మాలతి వదిన ఎంత మంచిది, అమ్మ అన్నట్టు మామయ్య నిజంగా రాక్షసుడే. చూడటానికికూడా అలానే ఉంటాడు. అన్నయ్యంటే మామయ్యకు పడదు. మాలతి వదిన మామయ్యను ఎదిరించలేకపోయి ఉంటుంది. అందుకనే పెళ్ళికి ఒప్పుకుని ఉంటుంది. కళ్లు నిండి నీళ్లు చెంపల మీదుగా కారుతుంటే కళ్లు తెరిచి జేబులోంచి రుమాలు తీసి తుడుచుకుంటుంటే కాంతారావు ఆ కుఱ్ఱాడి వంకే చూడసాగాడు. బస్సులో ఒక్కలైటే వెలుగుతోంది.

"నీ పేరేమిటి?" చిన్నగా అడిగాడు.

"రవీంద్ర."

"చదువుకుంటున్నావా?"

తలూపాడు. ఎన్నోక్లాసో, ఎక్కడో కూడా చెప్పాడు.

కథా నిలయం
4693
శ్రీకాకుళం

"సెలవులకు గుంటూరు వెళ్తున్నావా?"

"మా వదిన పెళ్లికి వెళ్తున్నాను. ఎల్లుండే పెళ్లి."

వెలుగుతున్న ఒక్క లైటూ ఆరిపోయింది. బస్సుతోపాటు పండు వెన్నెల పరుగెడుతోంది. కాంతారావు సీటుకు చేరగిలబడి కళ్లు మూసుకున్నాడు. మనసు ప్రశాంతంగా ఉంది. రెండు వారాలపాటు ఆఫీసుకు, ఫైళ్లకూ దూరం. ఈ మధ్యలో...

జేబులోంచి సిగరెట్ తీసి వెలిగించి కిటికీ అద్దాన్ని వెనక్కి జరిపాడు. వెన్నెల వెలుగు గాలితోపాటు సీటు మీదకు జరిగింది. సిగరెట్ సగం కూడా కాల్చలేదు, రవీంద్ర రెండు చేతులతో ముఖం కప్పుకుని శబ్దం కాకుండా ఏడుస్తోంటే సిగరెట్ కిటికీలోంచి బయటకు విసిరి, రవీంద్ర భుజం తడుతూ "ఏమయింది తమ్ముడూ?" అడిగాడు.

రవీంద్ర ఏడవటం ఆపాడుకాని వెంటనే జవాబు చెప్పలేదు.

"ఎందుకు ఏడుస్తున్నావు?" బుజ్జగిస్తూ అడిగాడు.

"............."

"వంట్లో బాగాలేదా?"

తల అడ్డంగా ఆడించాడు రవీంద్ర.

"నీకే విధమయిన ఇబ్బందిగా ఉంటే చెప్పు."

రవీంద్ర ఏదో చెప్పబోతుండగా బస్సులో లైట్లన్నీ ఒక్కసారిగా వెలిగాయి. బస్సు స్లో చేసి రోడ్డు పక్కగా ఉన్న రెస్టారెంటు ముందాపాడు డ్రైవరు. "ఇక్కడ బస్సు ఇరవై నిమిషాలు ఆగుతుంది. టీ తాగేవాళ్ళు తాగేసి రావచ్చు" అన్నాడు కండక్టర్.

"పద, టీ తాగొద్దాం" లేచి నుంచున్నాడు కాంతారావు.

"నాకు టీ అలవాటు లేదు."

"నాకు తోడు రావచ్చుకదా?"

రవీంద్ర లేచి నుంచున్నాడు.

ఇద్దరూ బస్సు దిగి టీస్టాలులోకి వచ్చి కూర్చున్నారు. తనకోసం టీ, రవీంద్రకోసం కూల్ డ్రింక్ చెప్పి సిగరెట్ వెలిగించాడు. టీ, కూల్ డ్రింక్ వెంటనే వచ్చాయి. తాగటం ముగించాక రవీంద్ర, "మా మామయ్య మొదట్లో అమ్మను, అన్నయ్యను, నన్నూ బాగానే చూసుకునేవాడు. మా నాన్న నా చిన్నప్పుడే పోయారు. సంవత్సరం కిందటివరకు మామయ్య మాతో బాగానే ఉన్నాడు. ఈ మధ్యలో ఏమయిందో ఏమో కాని మనిషి మారిపోయి మా ఎడల రాక్షసుడిలా ప్రవర్తించటం మొదలెట్టాడు. మునుపు హిమాయత్ నగర్‌లో మా ఇంటి పక్కనే ఉండేవాళ్లు. ఆరు నెలల కిందటే మామయ్యకు గుంటూరు బదిలీ అయింది. వెళ్లిపోయేప్పుడు మా అమ్మను అన్నయ్యను తిట్టి ఇంట్లోంచి మెడపెట్టి గెంటేశాడు. అప్పటి నుండి మేము వాళ్లింటికి వెళ్లటం మానేశాం. మాలతి వదిన మటుకు మామయ్యకు అత్తయ్యకు తెలియకుండా రెండు మూడు రోజుల కొకసారయినా వచ్చి అన్నయ్యను కలుస్తుండేది. ముందు మాలతి వదినను మా అన్నయ్యకు ఇద్దామనుకున్నారు. తాంబూలాలు పుచ్చుకున్నారు కాని ఈ గొడవలతో చెడిపోయింది. ఎల్లుండి వదిన పెళ్లి. తనకా పెళ్లి ఇష్టంలేదని వచ్చి తనను తీసుకెళ్లమని వారం కిందట వదిన అన్నయ్యకు ఉత్తరం కూడా రాసింది" అన్నాడు.

"ఈ పెళ్లికి నువ్వొక్కడివే వెళ్తున్నావేం?"

"మా అమ్మకు వంట్లో బావోలేదు."

"మీ అన్నయ్య పేరేమిటి?"

"చలపతి. మాలతి వదిన పెళ్లికార్డు అందిన దగ్గిర నుండి ఆఫీసుకు సరిగా వెళ్లటం లేదు. ఇంట్లోనే దిగాలుగా కూర్చుంటున్నాడు. మా ఇంట్లోవాళ్లు ఎవరం వెళ్లకపోవటం బావుండదని అమ్మ నన్ను వెళ్లమంటే నాకు తప్పలేదు." అని జేబులోంచి పెళ్లికార్డు తీసి కాంతారావు చేతిలో పెట్టాడు రవీంద్ర.

తెలతెలవారుతుండగా బస్సు విజయవాడ చేరింది. సూటుకేస్ అందుకుని దిగబోతున్న కాంతారావును చూసి, "ఏమిటండీ ఇక్కడ దిగిపోతున్నారు, గుంటూరు వరకు వస్తానన్నారు?" ఆశ్చర్యపోతూ అడిగాడు రవీంద్ర.

"ఇక్కడో చిన్న పని చూసుకుని ఎనిమిది గంటలకు గుంటూరు బయల్దేరతాను." అని బస్సు దిగిపోయాడు కాంతారావు.

బాగా తెల్లవారింది. విజయవాడ నుండి హైదరాబాదు వెళ్లేబస్సు సిమెంటు రోడ్డుమీద వేగంగా జారిపోతోంది. పచ్చటి పొలాలు వంతు లేసుకుని తోడుగా పరుగెత్తుతున్నాయి. చివరంటా కాలిన సిగరెట్‌ను కిటికీలోంచి బయటకు విసిరి సీటుకు చేరగిలబడ్డాడు కాంతారావు. నిద్రవస్తోంది. కళ్లు మూసుకున్నాడు. అమ్మా, నాన్న, అక్కయ్య, అన్నయ్య, బంధువులంతా తనకోసం ఎదురుచూస్తూ ఉంటారు. తనకోసం గుంటూరు బస్సు స్టాండుకు ఎవరినయినా బండిచ్చి పంపించి కూడా ఉంటారు. తను వెళ్లకపోతే ఎంత అవమానానికి గురవుతారో ఊహించగలడు. ఈ పరిస్థితుల్లో తను ఇంతకన్నా ఏంచేయగలడు? రవీంద్ర గుర్తు వచ్చాడు. ఈ సరికి అతను గుంటూరు చేరుకుని ఉంటాడు. చేతిగడియారం వంక చూసుకున్నాడు. ఏడూ ఇరవై అయిదు అయింది. సీటుకిందున్న సూటుకేసు తెరిచి పైనున్న కవరు తీసి, సూటుకేసు మూతవేసి సీటుకిందకు నెట్టాడు. కవరులో నాలుగు పెళ్ళికార్డులున్నాయి. ఒక కార్డు తీశాడు. తన పేరు ఎదురుగా మాలతి పేరుంది. మధ్య డిజైన్‌లాగీత ఉంది. నాలుగు కార్డులు కలిపి మధ్యగా చింపాడు. ఆ ఎనిమిది ముక్కలను పదహారు, ముప్ఫయి రెండు, అరవై నాలుగు చేసి కిటికీలోంచి బయటకు విసిరాడు. ముక్కలు గాలిలో ఎగురుతూ ఒక్కొక్కటిగా రోడ్డు మీద పడుతున్నాయి. మనసు ప్రశాంతమవుతోంది. ఒక ముక్క మటుకు కిటికీ అద్దానికి కొట్టుకుని అలానే రెండు క్షణాలపాటు అంటిపెట్టుకుని గాలికి లోపలికి వచ్చి కాంతారావు చొక్కా జేబులో పడింది. బయటకు తీశాడు. దానిమీద బంగారపు అక్షరాలతో "మాలతి" అని ఉంది. కాంతారావుకు దేవుడిమీద నమ్మకం లేదు. అయినా ఆ క్షణంలో 'భగవంతుడా, మాలతిని చలపతిని ఒకటి చేయి. నా జీవితంలో నిన్ను ఇంతకన్నా ఏదీ కోరను' అనుకున్నాడు.

◆ ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 16 సెప్టెంబరు 1966